
ఈనాడు
వైయస్సార్
సోమవారం అక్టోబరు 7, 2024



సిద్దవటం మండలం కొత్తపల్లిలో వాడిపోయిన చెట్టు మళ్లీ చిగురిస్తోందిలా...

సగం పచ్చగా... ఎండగా


ఇటీవల కాలంలో ఏళ్ల నాటి చెట్లు కూడా పూర్తిగా ఆకులు రాలిపోయి ఎండిన కొమ్మలతో దర్శనమిస్తున్నాయి. మరికొన్ని చెట్లు సగం పచ్చగా వుంటే మిగతా సగం వాడిపోయి కనిపిస్తున్నాయి. దీంతో స్థానికులు ఎండిపోయిందని భావించి వాటిని కొట్టేస్తున్నారు. తొలగించకుండా అలానే ఉంచిన చెట్లు మాత్రం వర్షాలకు తిరిగి చిగురించి, మామూలు స్థితికి వస్తున్నాయి. దీనిపై ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సునీల్‌కుమార్ మాట్లాడుతూ... ఎండలు ఎక్కువైనప్పుడు లేదా టీ-మస్కిటో బగ్ ఆశిస్తే చెట్లు వాడిపోతున్నాయని చెప్పారు. దీని నివారణకు ఇమిడా క్లోఫిడ్ మందును 0.4 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. వర్షాలు పడ్డాక తిరిగి కొన్ని చెట్లు చిగురిస్తాయని పేర్కొన్నారు. - ఈనాడు, కడప

16 మంది ఇంజినీరింగ్ సహాయకుల తొలగింపు

ఈనాడు, కడప: జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో 16 మంది ఇంజినీరింగ్ సహాయకులను తొలగిస్తూ కలెక్టర్ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్-2 విభాగానికి చెందిన వీరు నెలల తరబడి అనధికారికంగా విధులకు డుమ్మా కొట్టడం, ఫోన్ చేసినా స్పందించకపోవడం తదితర కారణాలతో నోటీసులు జారీ చేసినా సమాధానం ఇవ్వలేదని గుర్తించారు. ఈ తరుణంలో ఉద్యోగాల నుంచి తొలగిస్తూ కలెక్టర్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. మండలాల్లోని సచివాలయాల వారీగా ఉద్యోగుల వివరాలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జగజ్జనని... లోకపావని

శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆదివారం జగజ్జనని లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు... జిల్లావ్యాప్తంగా శక్తి స్వరూపిణి వివిధ ఆలయాల్లో శ్రీచక్ర అధిష్టానశక్తిగా, పంచ దశాక్షరీ మహా మంత్రాది దేవతగా తనను కొలిచే భక్తులకు దర్శనమిచ్చారు. కుడివైపున లక్ష్మీదేవి, ఎడమ వైపున సరస్వతీదేవి సేవలు చేస్తుండగా చెరకు గడ, విల్లు, పాశాంకుశాలను ధరించి ఎరువు, నీలం రంగు చీరల్లో జగన్మాత దర్శనమిచ్చారు. అమ్మవారికి రాజభోగం పేరుతో పాయసాన్నం, చక్రాన్నం, పూర్ణాలు, అల్లం గారెలు ఇలా వివిధ రకాల నైవేద్యాలను సమర్పించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన ఆలయాల్లో అమ్మవారి దేదివ్యరూప చిత్రాలివి. - న్యూస్‌టుడే బృందం



జమ్మలమడుగులోని కన్యతీర్థంలో అన్నపూర్ణాదేవిగా బాల త్రిపురసుందరీదేవి



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవిగా వాసవీ మాత



కడప లలిత పంచాయతన ఆలయంలో అన్నపూర్ణాదేవిగా జగన్మాత దర్శనం



కడప విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారి రథాన్ని లాగుతున్న భక్తులు



ప్రొద్దుటూరులో అమ్మవారి దర్శనానికి భక్తుల బారులు



కడప లలిత పంచాయతన ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దిరెడ్డివి శవ రాజకీయాలు
రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఫరూక్



మాట్లాడుతున్న మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, పక్కన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: గత వైకాపా హయాంలో రూ.వేల కోట్ల విలువైన భూములను దోచిన మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తాజాగా శవ రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ ఆరోపించారు. మదనపల్లెకు ఆదివారం వచ్చిన మంత్రి ఫరూక్ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయ దహనం ఘటనలో పలు అనుమానాలు ఉన్నాయని, విలువైన రెవెన్యూ దస్త్రాలు అగ్నికి ఆహుతయ్యాయని పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎవరెవరి హస్తం ఉందో స్థానికులకు బాగా తెలుసునని స్పష్టం చేశారు. పుంగనూరులో బాలిక మృతి ఘటనలో పెద్దిరెడ్డి నాలుగు రోజుల తర్వాత పత్రికల ముందుకు వచ్చి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పెద్దిరెడ్డికి బాధిత కుటుంబంపై సానుభూతి ఉంటే ఘటన జరిగిన రోజే ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పలమనేరులో ఓ బాలిక తరగతిలో మొదటి ర్యాంకు సాధించినందుకు ఆ అమ్మాయిని వైకాపా నాయకులు వేధింపులకు గురిచేసి ఆత్మహత్య చేసుకునేలా చేశారని ధ్వజమెత్తారు. వైకాపా నాయకులు భూమిని ఆక్రమించుకుని వేధింపులకు గురిచేయడంతో కర్నూలులో ఓ మైనార్టీ కుటుంబం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుందని అప్పట్లో అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వ మంత్రులు, ఎమ్మెల్యేలు కనీసం బాధిత కుటుంబాలను పరామర్శించలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి తెదేపా కృషి చేస్తోందని వివరించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న షాదీమహల్ నిర్మాణాలను పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా, రాష్ట్ర సమాచార హక్కు మాజీ కమిషనర్ ఇంతియాజ్, మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూక్ షిబ్లి పాల్గొన్నారు.

బెదురు లేకుండా వెదురు రవాణా



దస్తగిరి స్వామి పండుగ (జెండా పండుగ) వస్తే చాలు పట్టణాల్లో, గ్రామాల్లో కోలాహలంగా ఉంటుంది. ఈ పండగ సందర్భంగా అన్ని దర్గాల్లో పెద్ద పెద్ద జెండాలను రంగు కాగితాలతో ముస్తాబు చేసి ఊరేగిస్తారు. అందుకు జెండాల కోసం పెద్ద పెద్ద వెదురు కర్రలను తెప్పిస్తారు. అంతటి భారీ వెదురు బొంగులు కేవలం నల్లమల అడవుల్లోనే లభ్యమవుతాయి. నంద్యాల జిల్లా అహోబిళం సమీపంలోని అడవుల నుంచి తెచ్చిన ఈ వెదురు కర్రలను జమ్మలమడుగు ప్రాంతంలో విక్రయిస్తుంటారు. ఈ నెల 15వ తేదీన జెండా పండగను పురస్కరించుకుని సుమారు 50 అడుగుల పొడవున్న వెదురు కర్రలను విక్రయించడానికి ట్రాక్టర్లలో తీసుకెళ్తుండగా ప్రజలు ఆసక్తిగా పరిశీలించారు. ప్రమాదం జరుగుతుందన్న భయం బెదురు లేకుండా ఇలా రవాణా చేయడంపై స్థానికులు చర్చించుకున్నారు. - న్యూస్‌టుడే, జమ్మలమడుగు

బాగుండెదెలా?



3 నెలలు... 100కు పైగా మృతులు

జిల్లాలో గత మూడు నెలల్లో గుండెపోటుతో దాదాపు 100 మంది మృత్యువాత పడినట్లు ఓ అంచనా. వీరిలో అత్యధిక శాతం 35 ఏళ్లలోపు వారే కావడం గమనార్హం. మృతుల్లో ఎక్కువ మంది మగవారు కాగా వారిలో మెజార్టీ మద్యం అలవాటు ఉన్న వారేనని తేలింది.

ఆగుతున్న యువ హృదయ స్పందనలు

ఆకస్మిక మరణాలతో అంతటా ఆందోళన

జే-బ్రాండ్ మద్యంతోనూ ముప్పు

డీజేలతో ప్రమాదకరం

ఇటీవల కడపలోని ఓ థియేటర్‌లో ఓ అభిమాని తొలిరోజే తన అభిమాన హీరో సినిమా చూడడానికి వచ్చారు. కేకలు, శబ్దాలకు తట్టుకోలేక అతను గుండెపోటుతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబం అనాథగా మారింది.

ఎన్నికల ప్రచారం జరుగుతున్న సమయంలో వాహనాల్లో పెద్ద పెద్ద శబ్దాలతో డీజేలు పెట్టడంతో ఆ పక్కనే వెళుతున్న 60 ఏళ్ల వృద్ధుడికి ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. కిందపడిపోగా వెంటనే ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతనికి స్టంట్ వేశారు.

వినాయక నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులో డీజేలు పెట్టుకుని వెళ్తుండగా ఆ శబ్దాలకు, పాటలకు యువకుడు కేరింతలు కొడుతూ హఠాత్తుగా గుండె ఆగి కింద పడి మృతి చెందాడు.

ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. పాతికేళ్లు కూడా నిండని యువత గుండెలు ఆగిపోతుండడం అంతుబట్టని విషయంగా మారింది. నృత్యం చేస్తూ మృతి చెందిన మరికొందరి ఉదంతాలు వెలుగు చూస్తుండడంతో అంతటా ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. డీజే వాహనాల వద్ద భరించరాని శబ్దాలు కూడా దీనికి ఒక కారణంగా వైద్యులు చెబుతుండడంతో ఇప్పుడు అందరి దృష్టి వాటిపై పడింది. చిన్న వయస్సులోనే అనంత లోకాలకు వెళ్లిపోతున్న యువతను చూసి తల్లిదండ్రులు మానసికంగా కుంగిపోతున్నారు.

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే

ఎదుగుతున్న బిడ్డలు ఒక్కసారిగా కుప్పకూలిపోతే ఆ తల్లిదండ్రుల మానసిక క్షోభను వర్ణించలేం. బిడ్డల బాగు కోసమే తల్లిదండ్రులు సర్వస్వం ధారబోస్తారు. అలాంటి పిల్లలు మద్యం మత్తుకు అలవాటు పడి, చెడు స్నేహాలతో జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. తాము ఆరోగ్యంగా ఉన్నామనుకుంటూనే శరీరం లోపల పెరిగే జబ్బులను నిర్లక్ష్యం చేస్తున్నారు. అధిక శబ్దాలు హృదయ స్పందనపై ప్రభావం చూపుతుండగా, మద్యం మత్తు, నృత్యాలతో గుండెలు ఆగిపోతున్నాయి. యువ గుండెలు ఆగి ఆ కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా చేస్తున్నాయి. యువత ప్రవర్తన, జీవన విధానంలో మార్పు రావాలని వైద్యులు అంటున్నారు.

పెద్ద పెద్ద శబ్దాలతో అనర్థం

- సాధారణ మానవుడి గుండె నిమిషానికి 60 నుంచి 100 సార్లు కొట్టుకుంటుంది. అదే వ్యాయామం లేదా కసరత్తులు, పనులు చేసినప్పుడు ఆ వేగం 170 నుంచి 180 సార్లకు చేరుకుంటుంది. శరీరంలో హార్మోన్లు, న్యూరో కెమికల్స్‌లో వచ్చే మార్పుల వల్ల రక్తపోటు, కొవ్వు, చక్కెర స్థాయిలు ఉన్న వారికి 180 నుంచి 200 సార్లు కొట్టుకుంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి వారు నృత్యాలు చేసే సమయంలో గుండె వేగం మరింత పెరిగి గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని నిపుణుల అభిప్రాయం.
- సాధారణంగా మానవుని చెవులు 120 నుంచి 130 డెసిబుల్స్ వరకు శబ్దాన్ని భరించగలవు. 150 డెసిబుల్స్ మించితే వినికిడి సమస్య వస్తుంది. కర్ణభేరి దెబ్బతినే అవకాశం ఉంది. 150 డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్దం వింటే రక్తపోటు, పెరిగి గుండె సమస్యలు వస్తాయి. డీజే శబ్దాలతో వచ్చే వైబ్రేషన్స్ వల్ల శరీరంలో నాడి వ్యవస్థ దెబ్బతిని మెదడుకు రక్తం సరఫరా తగ్గుతుంది. గుండెకు రక్తం అందించే నాళాలు మూసుకుపోయి గుండె ఆగిపోయే అవకాశం ఉంది. దీని వల్ల గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువ ఉంటాయని వైద్యులు అంటున్నారు.

డీజే శబ్దాలతో గుండెతో పాటు చెవికి ఇబ్బంది ఎదురౌతుందని వైద్యులు అంటున్నారు. ఒకస్థాయి వరకు మాత్రమే చెవులు శబ్దాన్ని వినగలవు. సాంకేతికత మారుతుండటంతో విపణిలోకి భారీ శబ్దాలు చేసే స్పీకర్లు వస్తున్నాయి. కొంతమంది వీటిని వాహనాలకు అమర్చుకుని పాటలు పెడుతున్నారు. శుభ కార్యాలు, పుట్టిన రోజులు, పెళ్లి రోజులు, వినాయక నిమజ్జనాలు, పండగలకు డీజే పెట్టడం సర్వసాధారణమైంది. అయితే వాహనానికి దగ్గరగా నృత్యం చేయడం వల్ల స్పీకర్ల శబ్దాలకు గుండెలు అదురుతున్నాయి. ఈ నేపథ్యంలో హృదయ స్పందనలో ఆకస్మిక మార్పులు చోటుచేసుకుని గుండెపోటుకు గురవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. దీంతో పాటు మద్యం తాగి నృత్యం చేయడం వల్ల మత్తులో కింద పడి తలకు, తగలకూడని భాగాలకు దెబ్బ తగలడం వల్ల కూడా మృతి చెందుతున్నట్లు తెలుస్తోంది.

ఆయువు తీస్తున్న మద్యం

గత వైకాపా ప్రభుత్వం చిత్ర విచిత్రమైన పేర్లతో మార్కెట్‌లోకి తీసుకు వచ్చిన మద్యం బ్రాండ్లు యువత పాలిట శాపంగా తయారయ్యాయి. ఇందులో విష పూరిత రసాయనాలు మెదడును మొద్దుబారేలా చేయడంతో విపరీతమైన హాని కలుగజేస్తున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. మద్యం మత్తులో నేరాలు పెరగడంతో పాటు, రోడ్డు ప్రమాదాలు, అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యాయి. యువత ఎక్కువగా వీటి దుష్ప్రభావాలతో ఆసుపత్రుల పాలవడంతో పాటు కిడ్నీలు దెబ్బతిని, దీర్ఘకాలిక వ్యాధులకు గురవడంతో పాటు ఎక్కువ మంది కోలుకోలేక మృత్యువాత పడుతున్నారు. యువత గుండెలు ఆగడానికి జే-బ్రాండ్ మద్యం కూడా ఒక కారణమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

శబ్దాలతో చాలా ప్రమాదం



మనిషి చెవులు 120 నుంచి 130 డెసిబుల్స్ వరకు శబ్దాన్ని భరిస్తాయి. 150 డెసిబుల్స్ వరకు శబ్దం చెవుల్లోకి వెళ్తే వినికిడి సమస్య వస్తుంది. కర్ణభేరి దెబ్బతినే ఆస్కారముంది. పైగా రక్తపోటు పెరుగుతుంది. మనిషిలోని నాడీ వ్యవస్థ కూడా దెబ్బతింటుంది. దీంతో ఆరోగ్యపరంగా సమస్యలు ఉత్పన్నమవుతాయి. ముఖ్యంగా ఈ శబ్దాలు గర్భిణులకు చాలా ప్రమాదకరం. పిండం పెరుగుదల, శిశువు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. అన్ని వయసుల వారికి సమస్యలు వస్తాయి. రక్తపోటు పెరగడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోతారు. రాత్రి వేళల్లో ఎక్కువగా టీవీలు, చరవాణులు, పెద్ద పెద్ద శబ్దాలు వింటే నిద్రపట్టకపోవడం, ఒత్తిడి పెరిగి మైగ్రేన్ వస్తుంది. గుండె జబ్బులు, చెవుడు వచ్చే అవకాశముంది.

- అంపాబత్తిని గౌరి, గుండెజబ్బుల నిపుణులు, కడప

వైవీయూలో ఆడిటోరియం నిర్మించాలి

కడప విద్య, న్యూస్‌టుడే : యోగివేమన విశ్వవిద్యాలయంలో ఆడిటోరియం నిర్మించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున కోరారు. నగరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం పరిధిలోని గురుకులంలో విద్యార్థులు వెళ్లే దారికి రోడ్డు లేకుండా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే అధికారులు కొత్తరోడ్డు నిర్మించాలని కోరారు. హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. గురుకులంలో చదివే విద్యార్థులకు ప్రత్యేక బస్సు నడపాలని కోరారు. కార్యక్రమంలో వైవీయూ శాఖ అధ్యక్షుడు హనీష్, ఉపాధ్యక్షులు జావీద్ వలి, అరుణ్, ప్రేమ్ పాల్గొన్నారు.

బొప్పాయి రైతుల సమస్యల పరిష్కారానికి వినతి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: జిల్లాలో బొప్పాయి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ కోరారు. రైల్వేకోడూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ... ఈ నెల 5న రాయచోటిలో వ్యాపారులు, దళారులతో సమావేశం నిర్వహించాలని యత్నించగా ఎవరూ రాలేదన్నారు. ఈ విషయమై జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌ను శనివారం రాత్రి రాయచోటిలో కలిసి వినతి పత్రం అందించినట్లు వివరించారు. వారం రోజుల్లోపు పోలీసు, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు ధరలు పెంచేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఇతర ప్రాంతాల్లో రూ.25 వేలున్న టన్ను బొప్పాయి ధర ఇక్కడ మాత్రం రూ.10 వేలకు మించడం లేదని.. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని రైతులు ఆరోపించారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

కడప విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు దసరా కానుకగా 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పాటై వందరోజులు పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన విధంగా మధ్యంతరభృతిని ప్రకటించి వెంటనే 12వ పీఆర్సీ అమలుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పింఛనర్లు, సీపీఎస్ ఉద్యోగులకు కరవు భత్యం బకాయిలను నగదురూపంలో చెల్లించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల, సబ్జెక్టు ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తక్షణమే ఉద్యోగోన్నతులు చేపట్టి భర్తీ చేయాలని సూచించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మల్లికార్జునరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానాన్నీ వదలని మేతలు

వైకాపా గుత్తేదారుల కోసమే పనులు

చేసింది అరకొర... అక్రమాల దొంతర



నెలల వ్యవధిలోనే కుంగిన కాలిబాట

కడప నగరపాలక, న్యూస్‌టుడే

ఇది వైకాపా జమానాలో 2024 ఫిబ్రవరిలో ప్రారంభించిన ఆదర్శ హిందూ శ్మశాన వాటిక!ఆ శ్మశానానికి మూడు వైపులా ప్రహరీ ఉంటుంది. ఒక వైపు మాత్రం అటవీశాఖకు చెందిన కొండే ప్రహరీ... కాదు కాదు కొండను శ్మశానం ప్రహరీగా మార్చారు! మరి ఆ అటవీ ప్రాంతం నుంచి జంతువులు శ్మశానంలోకి చొరబడవా... శవాలను పీక్కుతినవా? ఇదే ప్రశ్నను నగరపాలక ఇంజినీరింగ్ అధికారులను అడిగితే ఆ కొండను దాటి ఏ జంతువూ శ్మశానంలోకి ప్రవేశించలేదని చెబుతున్నారు. అటు వైపు ప్రహరీ కట్టడానికి నిధులు లేవని తేల్చేస్తున్నారు. ఈ పనులకు అయ్యే వ్యయాన్ని అంచనా వేసేటపుడు నిధులున్నాయా? లేవా? అన్న అంశాన్ని ఎందుకు పరిగణలోకి తీసుకోలేదు, ఒకవైపు రక్షణ గోడ లేకుండా శ్మశానానికి ఏ విధంగా రక్షణ కల్పిస్తామనుకున్నారు అన్న ప్రశ్నలకు అధికారుల వద్ద స్పష్టమైన సమాధానం లేదు. ● ఈ శ్మశానం లోపల ఏర్పాటు చేసిన కాలిబాట పలకలు పరిచిన ఆరు నెలలకే భూమిలోకి కూరుకుపోతున్నాయి. సిమెంటు పనులు పూర్తిస్థాయిలో చేయకపోవడం వల్ల అతికించిన పలకలు ఊడి వచ్చేస్తున్నాయి. ఇక్కడి ఇతర శ్మశాన వాటికల చుట్టూ సిమెంటుతో ప్రహరీ నిర్మించారు. ఒక్క హిందూ శ్మశాన వాటికకు మాత్రమే రెడీమేడ్ సిమెంటు పలకలతో రక్షణ గోడ కట్టారు. ఇప్పటికే పలుచోట్ల సిమెంటు పలకలు ఊడిపోయాయి. శ్మశానంలో పచ్చదనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అగ్రిమెంటులో స్పష్టం చేశారు. కానీ శ్మశానంలో పిచ్చి మొక్కలు తప్ప పెంచిన మొక్కలు కనిపించడం లేదు.

విద్యుత్తు దహన వాటిక వినియోగం ఏదీ?

హిందూ శ్మశాన వాటిక పక్కనే శవదహనానికి ప్రత్యేక విద్యుత్తు దహనవాటిక కట్టారు. దీన్ని సార్వత్రిక ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో వైకాపా పాలకులు ప్రారంభించారు. 8 నెలలు పూర్తి అవుతున్నా శవదహనానికి వినియోగించే గదిలో ఫ్లోరింగ్ వేయలేదు. బయట సగం ఆవరణలో మాత్రమే టైల్స్ పరిచారు. అభివృద్ధి పనులకు పర్యాయపదంగా చెబుతున్న విద్యుత్తు దహనవాటికలో ఇప్పటి వరకు ఒక కుక్కను, అనాథ శవాన్ని మాత్రమే దహనం చేశారు. వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ఆ భవనం శిథిల మవుతోంది. అన్ని మతాల వారికి వేర్వేరుగా శ్మశానాలను అభివృద్ధి చేయడానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.13 కోట్లతో పనులు చేపట్టారు. రూ.కోట్లు ఖర్చు చేసిన పనులు ఎందుకూ కొరగాకుండా పోవడం చర్చనీయాంశం అయింది. విద్యుత్తు దహనవాటికను రూ.1.54 కోట్లతో చేపట్టారు. ఈ పనులను శ్మశానాల అభివృద్ధి కోసం చేపట్టారా లేక అప్పటి అధికార పార్టీ నాయకుల అనుచరుల కోసమా? అని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. కడప-తిరుపతి ప్రధాన రహదారి నుంచి ఈ శ్మశానంలోకి వెళ్లడానికి వేసిన తారురోడ్డు మరింత అధ్వానంగా మారింది. కొన్ని నెలల క్రితం వేసిన బీటీ రోడ్డు పలు చోట్ల రెండు నుంచి మూడడగుల లోతుకు దిగబడిపోయింది.

అధికారులేమంటున్నారంటే...

ఈ అంశాలను ఇన్‌ఛార్జి కమిషనర్ రాకేశ్ చంద్రం దృష్టికి తీసుకుపోగా ప్రహరీ లేకపోవడం తన దృష్టికి వచ్చిందని, శ్మశానంలో గ్రీనరీ, కాలిబాట పనులు, ఎలక్ట్రానిక్ క్రిమిటోరియం పనులను పూర్తి చేయకపోవడానికి గల కారణాలపై సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



చాపాడు, న్యూస్‌టుడే: చాపాడు మండలం వి.రాజుపాళెం వద్ద కారు ఢీకొని **ఆదిమూలం చంద్రమోహన్** (52) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. శనివారం రాత్రి వెదురూరుకు చెందిన రామసుబ్బారెడ్డి, కమాల్‌బాషా ఇద్దరు కలిసి ప్రొద్దుటూరు పట్టణం నుంచి కారులో ఇంటికి బయల్దేరారు. వి.రాజుపాళెం వద్దకు రాగానే ఇంటి బయట మంచం వేసుకుని నిద్రిస్తున్న చంద్రమోహన్‌ను కారుతో ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. చంద్రమోహన్‌కు భార్య వెంకటసుబ్బమ్మ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నామన్నారు.

తప్పిన పెను ప్రమాదం



నడిరోడ్డుపై బోల్తాపడిన కారు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప చిన్నచౌకు ఠాణా పరిధిలోని అప్సర థియేటర్ సమీపంలో ఆదివారం పెనుప్రమాదం తప్పింది. అన్నమాచార్య కూడలి నుంచి కారును ఓ వృద్ధుడు నడుపుతూ వస్తున్నారు. ఆయన ఎక్స్‌లేటర్‌పై కాలు ఎక్కువసేపు అదిమి పట్టడంతో ఆ వేగానికి కారు డివైడర్ ఎక్కి బోల్తా పడింది. కారులో ఆయనతో పాటు మరొకరు ఉన్నారు. స్థానికులు వాహనాన్ని తిరిగి మామూలు స్థితికి చేర్చడంతో ఆ కారులోనే వారు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న చిన్నచౌకు సీఐ తేజమూర్తి తన సిబ్బందితో వెళ్లి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

క్లబ్బులపై దాడులు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప నగరంలో ఆదివారం బాధ్య డీఎస్పీ రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు క్లబ్బులపై దాడులు నిర్వహించారు. మొత్తం 31 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.13,480 నగదు స్వాధీనం చేసుకున్నారు. క్లబ్బుల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఐలు రామకృష్ణ, వెంకటేశ్వర్లు, సీతారామిరెడ్డి ఉన్నారు.

మద్యం దుకాణాల సిబ్బందికి ప్రత్యామ్నాయం చూపాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసే సేల్స్‌బాయ్స్, సూపర్‌వైజర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపి న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండు చేశారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ దసరా నుంచి నూతన మద్యం పాలసీ ద్వారా దుకాణాలను ప్రైవేట్ వ్యక్తుల ద్వారా నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న 15000 మంది సిబ్బందిని తొలగించడం బాధాకరమని చెప్పారు. వారికి ప్రత్యామ్నాయం చూపకపోతే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

జీవో 56 ఉపసంహరణకు విజ్ఞప్తి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న

కడప విద్య, న్యూస్‌టుడే : సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల సాంకేతిక కేంద్రం ఎంఎస్ఎంఈ కొప్పర్తి నుంచి అమరావతి తరలింపు కోసం ఇచ్చిన జీవో 56ను వెంటనే ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండు చేశారు. స్థానిక పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈ టెక్నాలజీ శిక్షణ కేంద్రం ద్వారా యువతకు ప్రపంచస్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణతో పాటు వివిధ ఇంజినీరింగ్ టెక్నాలజీ కోర్సులు, డిప్లమో ప్రోగ్రాంలు అందిస్తారన్నారు. ఇలాంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సంస్థను కొప్పర్తి పారిశ్రామికవాడ నుంచి అమరావతికి తరలించడం నిరుద్యోగ యువతను మోసగించడమేనన్నారు. నాయకులు గంగాధర్, మహేష్, చరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల విడుదలకు వినతి

కడప విద్య, న్యూస్‌టుడే : రెండేళ్లుగా పాఠశాల నిర్వహణ నిధులు మంజూరు చేయడం లేదని, ఈ ఏడాదైనా నిధులు విడుదల చేయాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ (ఆర్‌యూపీపీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్, అధికార ప్రతినిధి వీరబ్రహ్మం ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

విద్యార్థులు... సేవా వారధులు

ఉత్తమ పురస్కారాలు అందుకున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

న్యూస్‌టుడే, వైవీయూ (కడప)



కళాశాల ఆవరణంలో స్వచ్ఛతా కార్యక్రమంలో వాలంటీర్లు

విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ సమాజం పట్ల తమ బాధ్యత నెరవేరుస్తున్నారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ స్ఫూర్తిదాయక సేవలందించి ప్రశంసలు అందుకుంటున్నారు. ఎన్ఎస్ఎస్‌లో వాలంటీర్లుగా గ్రామాల్లో ఆరోగ్యవిద్యపై అవగాహన, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే విధానంపై గ్రామ ప్రజలకు తెలియజేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు. సేవల్లో ఆదర్శంగా నిలుస్తూ వైవీయూ పరిధిలో ఇటీవల ఉత్తమ ఎన్ఎస్ఎస్ పురస్కారాలు అందుకున్నారు.

ఎంతో సంతృప్తినిచ్చింది



నేను యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఎంసీఏ రెండో ఏడాది చదువుతున్నా. మాది కమలాపురం మండలం కోగటం. తల్లిదండ్రులు డి.సుబ్బమ్మ, డి.గురవయ్య ఇచ్చిన ప్రోత్సాహంతో సేవా కార్యక్రమాల్లో పాల్గొని ఉత్తమ ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌గా పురస్కారం అందుకున్నా. ఇటీవల దిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో కూడా పాల్గొన్నా. గ్రామాల్లో ప్రజలకు అనేక విషయాలపై అవగాహన కల్పించాం. చెట్లు నాటే కార్యక్రమం, వైద్య శిబిరాల్లో పాల్గొని సేవలందించా. ఇది నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. స్థానికులు కూడా మాకు ఎంతో సహకారం అందిస్తూ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. **- డి.మానస**

సామాజిక విషయాలపై అవగాహన



కడప నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో ఏడాది చదువుతున్నా. మా ఎన్ఎస్ఎస్ పీవో గోవింద రెడ్డితో పాటు తల్లిదండ్రులు నాగవేణి, భరత్ ఇచ్చిన ప్రోత్సాహంతో ఎన్ఎస్ఎస్ ద్వారా పలు సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొన్నా. విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు ఆనందంగా ఉంది. ఎన్ఎస్ఎస్ ద్వారా సమాజంలోని అనేక విషయాలపై అవగాహన కలిగింది. నగరంలోని రవీంద్రనగర్, నాగరాజుపేట తదితర ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించాం. **- మీనాక్షి**

అన్నివేళలా సిద్ధం



మైదుకూరు ఎస్‌బీఎస్ వీఎం డిగ్రీ కళాశాలలో చదువుతున్నా. సమాజ సేవ చేయడం ఒక అలవాటుగా మార్చుకోవాలన్న కళాశాల పీవో ఇచ్చిన స్ఫూర్తితోనే కార్యక్రమాల్లో పాల్గొన్ని పురస్కారం అందుకున్నా. అత్యవసర పరిస్థితుల్లోనూ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వెళ్లి సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఎన్ఎస్ఎస్ ద్వారా పట్టణంలోనే కాకుండా గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రతి విషయంపై అవగాహన కల్పించాం. క్రమశిక్షణ అలవరచుకోవడంతో పాటు సమాజ సేవ చేశామన్న సంతృప్తి ఉంది. **- మహబూబ్‌బాషా**



వేమన పద్యాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ కృష్ణారెడ్డి, ముఖ్యులు

వేమన తత్వాన్ని ఒడిసి పట్టిన శివారెడ్డి

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: వేమన తత్వాన్ని పరిశీలించి, పరిశోధించిన వ్యక్తి జి.శివారెడ్డి అని వైవీయూ వీసీ కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రసాయనశాస్త్ర విశ్రాంత ఆచార్యులు శివారెడ్డి రచించిన వేమన పద్యాలు అనే పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ వేమన పద్యాల్లోని ఎరుక, బయలు అనే పదాలను విశ్లేషించి వేమన ఏ మతానికి చెందిన వాడు కాదని, అతని తత్వం శూన్యవాదానికి దగ్గరగా ఉందని నూతన కోణంలో చెప్పడం విశేషమన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ శివారెడ్డి తన రచనల్లో కుల వ్యవస్థను వేమన పూర్తిగా వ్యతిరేకించారని, జన్మతః అందరూ శూద్రులేనని, సంస్కారం ద్వారా మాత్రమే ఇతరులుగా మారతారని చెప్పడం ఆయన పరిశీలనా దృష్టికి నిదర్శనమన్నారు. చింతకుంట శివారెడ్డి, రెడ్డి శేఖర్ రెడ్డి, స్వరూపారాణి, వెంకటేశ్వరాచారి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరుకున్న బాలామృతం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు బాలామృతం కింద పనిచేసే పోషకాహారం జిల్లాకు చేరింది. ఈ మేరకు ఆదివారం కడపలోని కడప అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో సుమారు 500 బస్తాలు వచ్చింది. కడప నగరంతో పాటు సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు వీటిని సరఫరా చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా త్వరలో పార్టీ ఏర్పాటు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్, తదితరులు

కడప, చిన్న చౌకు, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టులో వాదనలు విన్న తరువాత తీర్పును రిజర్వు చేశారని, దీనిపై తుదితీర్పు రాకముందే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాల వారీగా వర్గీకరణ చేపడతామని అనడం విడ్డూరంగా ఉందని మాజీ ఎంపీ హర్షకుమార్ పేర్కొన్నారు. కడప ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏ పార్టీ కూడా వర్గీకరణకు వ్యతిరేకంగా ఒక్క ప్రకటన కూడా చేయలేదని, ఈ నేపథ్యంలో తమ గొంతును వినిపించడానికి మైనార్టీలను కలుపుకుని త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ పెడతానని ప్రకటించారు. పార్లమెంటు శీతాకాలం సమావేశాల్లో వర్గీకరణ విషయంపై చర్చించాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే చలో పార్లమెంటుకు పిలుపు ఇస్తామన్నారు. వర్గీకరణకు ఎవరైతే వ్యతిరేకంగా ఉన్నారో వారందరూ ఒక్కతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తిరుమల లడ్డూ కల్తీపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధారాల్లేని ఆరోపణలు చేస్తున్నారని, దీనికి సాక్ష్యాలుంటే తాను ఆయన మాటలతో ఏకీభవిస్తానని చెప్పారు. వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వం అన్ని విషయాల్లో విఫలమైందని, వృద్ధులకు పింఛన్లు, అన్న క్యాంటీన్లు తప్ప ఇతర హామీలేవీ అమలు చేయలేదని ఆరోపించారు. సనాతన ధర్మానికి అర్థం ఏంటని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ప్రశ్నించారు. మతాన్ని రెచ్చగొట్టే విధంగా ఆయన మాటలున్నాయని వ్యాఖ్యానించారు. మూరతోటి విజయకుమార్, శేఖర్, మైనుద్దీన్ తదితరులున్నారు.

ఒకరు వైడ్ బాల్... మరొకరు నో బాల్



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ఒకరు వైడ్ బాల్ అయితే...మరొకరు నోబాల్ అని.... వాటిని వేస్తుంటే నేను బ్యాట్‌తో గుగ్గిబాల్‌ను సైతం సిక్సర్లుగా మలుస్తానని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఉద్దేశించి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం స్థానిక ముద్దనూరురోడ్డులోని రిపబ్లిక్ క్లబ్‌లో దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డితో కలిసి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాజకీయాలంటే మాటలు కాదని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమేనని స్పష్టం చేశారు. రహదారుల మరమ్మతులకు ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల నుంచి సుమారు రూ.40 కోట్లు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. ఉక్కు పరిశ్రమ, రాజోలి జలాశయం నిర్మాణంపై దృష్టిసారించామన్నారు. గండికోట నిర్వాసితులకు ఇంకా రూ.500 కోట్ల పరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు. రైతులకు సమ్మాన్ నిధి కింద కేంద్ర ప్రభుత్వం సహకారంతో రూ.20 వేలు ఇస్తామన్నారు.

జిల్లా పేరు మారుస్తాం: వేంకటేశ్వరస్వామి తొలి గడపగా ప్రసిద్ధి చెందిన కడప పేరును వైఎస్సార్ జిల్లాగా పెట్టడం తగదని, ఈ జిల్లా పేరు మారుస్తామని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి స్పష్టం చేశారు. అయిదేళ్ల వైకాపా పాలనలో భారత రాజ్యాంగం బదులు భారతి రాజ్యాంగం నడిచిందని విమర్శించారు. జిల్లా మార్పు విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పవిత్రమైన తిరుమల లడ్డూను సైతం మాజీ సీఎం జగన్ అపవిత్రం చేశారని దుయ్యబట్టారు. సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందని విచారణ పూర్తైతే ఆయన బండారం బయటపడుతుందని చెప్పారు.

పీఆర్సీ ఏర్పాటుకు డిమాండు

కడప విద్య, న్యూస్‌టుడే : ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రసాద్ డిమాండు చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12వ పీఆర్సీ అమలు పరచాల్సిన గడువు 14 నెలలు దాటినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తక్షణం 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించేలా ఈ నెల 10వ తేదీన జరిగే కేబినేట్‌లో నిర్ణయించాలని, కమిటీ అన్ని జిల్లాల్లో పర్యవేక్షించి ఉద్యోగ, ఉపాధ్యాయుల అభిప్రాయాలు సేకరించాలని కోరారు. ఆరు నెలల్లో నివేదిక సమర్పణ గడువు ఉండాలని ఉపాధ్యాయులకు ప్రత్యేక పీఆర్సీ ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు ఈశ్వర చంద్ర, ఉమాకాంత్, రాజగోపాల్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ పేరిట కుళ్లిన టమాట

నాసికరం కొనుగోలు చేసిన మార్కెటింగ్‌శాఖ ☛ కిలోకు సగానికి పైగా పనికిరానివే..

న్యూస్‌టుడే, కడప వ్యవసాయం



రైతుబజారు బయట పడేసిన నాసిరకం టమాటాలు

టమాటాల ధర కొండెక్కింది. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.60, వీధుల్లోని దుకాణాల్లో రూ.80 వరకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు తోటల వద్దే తక్కువ ధరకు కొనుగోలు చేసి, ప్రజలకు విక్రయించాలని చర్యలు తీసుకున్నారు. పులివెందులలో కిలో రూ.45తో కొనుగోలు చేసి ఆదివారం కడప రైతుబజారుకు సుమారు 2 టన్నులు తీసుకొచ్చారు. అవి కుళ్లిపోయి నీరు కారుతుండడంతో వినియోగదారులు కొనుగోలుకు ఆసక్తి కనబరచలేదు. దీంతో అక్కడున్న వ్యాపారులకే తూకం వేసి కట్టబెట్టారు. వారిలో కొందరు కిలో రూ.60 ప్రకారం ధర చెప్పగా కొందరు కిలో రూ.40, మరికొందరు కిలో రూ.30తో విక్రయించారు. అయినా చాలామంది కొనడానికి ముందుకు రాలేదు. ఒక కిలో తీసుకుంటే అందులో పనికి వచ్చేవి సగం కూడా లేవంటే ఆ కాయలు ఎలా దెబ్బతిన్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రతి వ్యాపారి సగానికి మించి పనికిరావని పక్కన పడేశారు. బాగున్నా, లేకపోయినా తూకం వేసిన ప్రతి కిలోకు డబ్బులు చెల్లించాలని మార్కెటింగ్ అధికారులు పేర్కొనడంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

అన్నీ దెబ్బతిన్నాయి

టమోటాలు కొనుగోలు చేయడానికి వస్తే చాలా దెబ్బతిన్నాయి. ఏరుకుని తీసుకున్నా చాలా వరకు నాసిరకంగానే ఉన్నాయి. ఇలాంటి వాటిని వినియోగదారులకు అమ్మడం సరికాదు.
- ఫజల్‌ఖాన్, వినియోగదారుడు, కడప

మోసం చేశారు..

పులివెందులలో చూసినప్పుడు బాగున్నాయి. వాటిలో కొన్ని పైన పెట్టి కింద బాక్సులు పనికిరాని కాయలు వేసి అక్కడి వ్యాపారి మోసం చేశాడు. ఇక్కడకు వచ్చి చూస్తే చాలా వరకు పాడయ్యాయి. ఇక నుంచి మంచి కాయలు తీసుకొచ్చి ఇస్తాం. **- అజాద్‌వలి, మార్కెటింగ్‌శాఖ ఏడీ, కడప**

అటు ఉత్సవాలు... ఇటు సెలవులు
అప్రమత్తంగా లేకుంటే ఊడ్చేస్తారు!

న్యూస్‌టుడే, కడప నేరవార్తలు, జమ్మలమడుగు గ్రామీణ



దసరా ఉత్సవాలు ఈ నెల 3 నుంచి ప్రారంభమయ్యాయి. పది రోజుల పాటు జరిగే వివిధ కార్యక్రమాల్లో ఆలయాలు సందడిగా ఉంటాయి. ప్రధానంగా మహిళలు అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రతిరోజూ వెళతారు. ఆ సమయంలో నగలు ధరిస్తే అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఉత్సవాలు ఎక్కువగా సాయంత్రమే జరుగుతాయి. అదే సమయంలో గొలుసు దొంగలు కూడా సంచరిస్తుంటారు. సాధారణ రోజుల్లోనే వారు రెచ్చిపోతున్నారు. పండగ సమయాల్లో ఇక చెప్పక్కర్లేదు. ఈ నేపథ్యంలో ఒంటరిగా కాకుండా బృందాలుగా మహిళలు వెళ్లాలని, వీలైనంత వరకు విలువైన ఆభరణాలు వేసుకోవద్దని పోలీసుల సిబ్బంది చెబుతున్నారు.

ఊళ్లకు వెళ్తున్నారా..

దసరా సెలవుల్లో చాలా మంది ఇళ్లకు తాళాలు వేసి సొంత ఊళ్లకు వెళ్తుంటారు. ప్రస్తుతం జిల్లాలో పట్టపగలే చోరీలు జరుగుతూనే ఉన్నాయి. ఇక ఇళ్లకు తాళాలు వేసి ఉంటే పరిస్థితి అధ్వానంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఊళ్లకు వెళ్లేవారు విలువైన బంగారు నగలు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరచుకుని వెళ్లడం ఎంతో ఉత్తమం. లేదంటే నమ్మకంగా ఉండే బంధువుల నివాసాల్లోనైనా పెట్టి వెళ్లాలి. మరోవైపు సంబంధిత ఠాణాలోని పోలీసు అధికారులకు సమాచారం ఇస్తే వారు ఉచితంగా ఇంట్లో ఎల్‌హెచ్ఎంఎస్ కెమెరాలను అమర్చుతారు. ఒక వేళ దొంగలు చోరీకి యత్నిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందుతుంది. వారు వెంటనే వచ్చి నిందితులను పట్టుకుంటారు. ఎల్‌హెచ్ఎంఎస్ కెమెరాలను సద్వినియోగం చేసుకుంటే ఇల్లు భద్రంగా ఉంటుంది.

ఆలయాల వద్ద నిఘా అవసరం

కడప, ప్రొద్దుటూరుల్లో దసరా ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆయా ఆలయాల వద్ద పెద్దఎత్తున నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. సీసీఎస్ పోలీసులు మఫ్టీలో ఉండి బందోబస్తు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

700 మందితో బందోబస్తు - హర్షవర్ధన్‌రాజు, ఎస్పీ, కడప



దసరా ఉత్సవాల సందర్భంగా ప్రొద్దుటూరుతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సుమారు 700 మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. ఎక్కడా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. చోరీలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. ప్రొద్దుటూరుపై ప్రత్యేక నిఘా ఉంచాం.


ఉపాధి హామీ పనుల పరిశీలన



డ్రాగన్‌ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న పీఆర్ అండ్ ఆర్డీ శివప్రసాద్, పక్కన అధికారులు

లింగాల, న్యూస్‌టుడే : ప్రతి నీటిచుక్కను భూమిలోకి ఇంకేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్ శివప్రసాద్ సూచించారు. ఆదివారం పెద్దకుడాల, లింగాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. సీతాఫలం, నేరేడు, జామ తదితర పండ్ల తోటల సాగుకు రాయితీలు ఇస్తున్నామన్నారు. పెద్దకుడాల ఉన్నత పాఠశాలలో ఉపాధి హామీ పథకం కింద నాటిన మొక్కలు, లింగాలలో రైతు రామిరెడ్డి సాగు చేసిన డ్రాగన్‌ఫ్రూట్ పంటను పరిశీలించారు. ఉపాధి ఏపీడీ సుబ్బారెడ్డి, ఏపీవో గంగరాజు, పర్యవేక్షకుడు లోకేశ్ పాల్గొన్నారు.

రామలింగచౌడేశ్వరి అమ్మవారికి బంగారు నేత్రాల బహూకరణ



బంగారు నేత్రాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగశయనానికి అందజేస్తున్న నాగరాజు, విజయలక్ష్మి దంపతులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మేదరవీధిలో ఉన్న రామలింగ చౌడేశ్వరి అమ్మవారికి ఆదివారం భక్తులు అంపావతిన నాగరాజు, విజయలక్ష్మి దంపతులు 26 గ్రాముల బరువు ఉన్న రూ.1.55 లక్షల బంగారు నేత్రాలను కానుకగా సమర్పించారు. ఆదివారం బంగారు నేత్రాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు వుట్టి నాగశయనానికి అందించారు. దాతలను ఆలయ కమిటీ ఛైర్మన్, ప్రతినిధులు సన్మానం చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు వుట్టి లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షుడు రామచంద్రుడు, భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి తపాలా ఉద్యోగుల సత్కారం



కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే : కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను గుంటూరులో ఆదివారం పులివెందుల తపాలా జీడీఎస్ ఉద్యోగులు కలిసి సత్కరించారు. పోస్టల్ శాఖలో గ్రామీణడాక్ సేవకులుగా పని చేసే 2 వేల మంది ఉద్యోగోన్నతి కోసం 2022, 2023 సంవత్సరాలల్లో పరీక్షలు రాశారని, వారికి ఇప్పటివరకు ఉద్యోగోన్నతి ఇవ్వలేదని మూడువారాల కిందట విన్నవించామన్నారు. ఈ విషయమై మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చి తమ సమస్య గురించి ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరించారని వారు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో పులివెందుల ఉద్యోగులు వరుణ్,వంశీ, నవీన్, కుళాయిశెట్టి, తదితరులున్నారు.

పసిడిపురి చిన్నారులు... జంప్‌రోప్ విజేతలు

రాష్ట్ర, జాతీయ పోటీల్లో ప్రతిభ

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి జంప్‌రోప్ క్రీడా పోటీల్లో సత్తా చాటుతున్నారు. బంగారు, రజత, కాంస్య పతకాలతో విజయబావుటా ఎగరేస్తున్నారు. తల్లిదండ్రులు, గురువుల మెప్పు పొందుతూ, తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఇస్లామిక్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. 6, 7వ తరగతి చదువుతున్న పి.ఆసియా, హీనా ఫిర్గోస్, డి.సల్మా, ఎస్.తబస్సుమ్ గత రెండేళ్లుగా పీఈటీ హసీనా వద్ద శిక్షణ పొందారు. పట్టుదల, క్రమశిక్షణ, చిత్తశుద్ధి, ఏకాగ్రతతో సాధన చేస్తున్నారు. జంప్‌రోప్ అసోసియేషన్ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో చక్కని ప్రతిభ చూపారు. డి.సల్మా, పి.ఆసియా బ్యాంకాక్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

అంతర్జాతీయ స్థాయికి ఎంపిక

అమ్మే తొలి గురువు



నా పేరు డి.సల్మా. ప్రొద్దుటూరులో ఏడో తరగతి చదువుతున్నా. అమ్మ హసీనా (పీఈటీ), నాన్న ప్రైవేటు ఉద్యోగి. రెండేళ్ల నుంచి జంప్‌రోప్ క్రీడపై శిక్షణ తీసుకుంటున్నాను. అమ్మే నా తొలి గురువు. తొలి ప్రయత్నంలో జిల్లా స్థాయిలో బంగారు, రాష్ట్ర స్థాయిలో రజతం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాను. మహారాష్ట్ర నాందేడ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి నేపాల్ దేశంలో జరిగే అంతర్జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీలకు ఎంపికయ్యాను. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో అక్కడ ఉత్తమ ప్రతిభ చూపుతాననే విశ్వాసం ఉంది. భవిష్యత్తులో భారత్‌కు బంగారు పతకం, ఐపీఎస్ సాధిస్తా.

ఒలింపిక్స్ లక్ష్యం



నా పేరు పి.ఆసియా. ప్రొద్దుటూరులో ఆరో తరగతి చదువుతున్నా. పవర్‌హౌస్‌రోడ్డులో నివాసం. అమ్మ అమీనా, నాన్న అబ్దుల్లా గోల్డు స్మిత్. వీరి ప్రోత్సాహంతో రెండేళ్ల నుంచి జంప్‌రోప్ క్రీడను తర్ఫీదు పొందుతున్నా. జిల్లా స్థాయిలో ప్రథమ, రాష్ట్ర స్థాయిలో ప్రథమ, జాతీయ స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచి, అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. అక్కడ కూడా చక్కని ప్రతిభ చూపి భారత్‌కు మంచి పేరు తేవాలని సాధన చేస్తున్నాను. భవిష్యత్తులో ఒలింపిక్స్ ఆడాలని, న్యాయవాది కావాలని లక్ష్యం ఉంది.

అంతర్జాతీయ స్థాయికి ఎంపికవ్వడమే ధ్యేయం



నా పేరు ఎస్.తబస్సుమ్. ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ యానాది కాలనీలో ఉంటున్నాం. ఏడో తరగతి చదువుతున్నా. నాన్న కరిముల్లా చనిపోవడంతో అమ్మ నూర్జహాన్ దర్జీ పని చేయగా వచ్చే డబ్బులతో చదువుకుంటూ, జంపురోప్ క్రీడలో రాణిస్తున్నా. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రజత పతకాలు సాధించి, మహారాష్ట్ర నాందేడ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. అంతర్జాతీయ స్థాయికి ఎంపికవ్వాలని, బాగా చదివి కలెక్టరవ్వాలని లక్ష్యం ఉంది.

ప్రొద్దుటూరు
• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని ప్రొద్దుటూరు లేపాక్షి డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక గోల్డెన్ పార్కులో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విలువలు అలవరుచుకోవడంతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం చదువు, క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరస్పాండెంట్ రాఘవరెడ్డి, డైరెక్టర్ లోకేశ్వరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నడిరోడ్డుపై బోరు... ప్రమాదాలతో బేజారు



బద్వేలు మండలం చింతలచెరువు గ్రామ పంచాయతీలోని బయనపల్లె బీసీ కాలనీ నడి రోడ్డులో బోరు ప్రమాదకరంగా మారింది. వాహనదారులు పాదచారులు రాకపోకలను సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ప్రభుత్వ బోరు ఉండేది. అది కాస్త చెడిపోవడంతో వాడటం మానేశారు. దీంతో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బోరు విడిభాగాలను తీసుకెళ్లగా బోరు గొట్టపు రంధ్రం మిగిలింది. పిల్లలు ఆటలాడుతూ బోరు రంధ్రం వద్దకు వెళతారేమోనని పెద్దలు కాపలా కాయలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై బద్వేలు ఎంపీడీవో నూర్జహాన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా నడి రోడ్డులో బోరు లేకుండా చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, బద్వేలు**

స్పందనకు వందనం

మైదుకూరు: పురపాలక పరిధి ఎల్లంపల్లెలో ప్రజారోగ్య విభాగ అధికారులు పరిసరాల పరిశుభ్రత చర్యలు తీసుకున్నారు. పరిసరాల అపరిశుభ్రతపై శనివారం ప్రచురితమైన సమస్యతో స్పందించి ఉర్దూ పాఠశాల, పీర్లచావిడి వద్ద చెత్తను తొలగించారు. గ్రామంలో బ్లీచింగ్ పొడిని చల్లించారు.

ఏఎంసీ మాజీ ఛైర్మన్ మృతికి నివాళి

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు ఏఎంసీ మాజీ ఛైర్మన్ బండి విజయభాస్కర్‌రెడ్డి మృతికి పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు ఆదివారం మనంగా నివాళి అర్పించారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, పుత్తా నరసింహరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, తెదేపా జమ్మలమడుగు నియోజకవర్గ బాధ్యుడు భూపేష్‌రెడ్డి, తదితరులు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

ఉద్యోగ మేళా నేడు

కొండాపురం, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతీ, యువకులు మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని భాజపా నాయకుడు శివనారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం జమ్మలమడుగు పట్టణంలోని రిపబ్లిక్ క్లబ్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జాబ్ మేళా నిర్వహిస్తారని తెలిపారు. దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేసీ కాలువలో తేలిన బాలుడి మృతదేహం

దువ్వూరు, న్యూస్‌టుడే : దువ్వూరుకు చెందిన టి.అమర్ (2) అనే బాలుడు మృతదేహం చాపాడు మండలం మొర్రాయపల్లె సమీపంలో కేసీ ఉపకాలువలో ఆదివారం లభ్యమైంది. ఈ బాలుడు ఈ నెల 3వ తేదీన సాయంత్రం అదృశ్యమవడం తెలిసిందే. కాలువలో నీటి సామర్థ్యాన్ని తగ్గించడంతో ఆదివారం మొర్రాయపల్లె సమీపంలో బాలుడి మృతదేహం కాలువలో ఉండటం గమనించి స్థానికులు పోలీసులు, కుటుంబ సభ్యులకు తెలిపారు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.


అమర్ (పాత చిత్రం)

హనుమనగుత్తిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని హనుమనగుత్తి గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో వెంకటరాముడు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు ఆదివారం ఎర్రగుంట్ల పోలీసులు తెలిపారు. శనివారం అర్ధరాత్రి వెంకటరాముడు, తన భార్య ఇంట్లో విషయంపై వాగ్వాదం చేసుకొంటున్నారు. ఈ నేపథ్యంలో మరొక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు తమనే అంటున్నారని అనుమానించి వచ్చి దాడిచేశారు. ఈ సంఘటనలో వెంకటరాముడు తీవ్రంగా గాయపడటంతో అతనిని ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

చాపాడు, న్యూస్‌టుడే: పెన్నా నది అక్రమంగా ఇసుక తరలిస్తున్న అయిదు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. శనివారం రాత్రి పొద్దుపోయాక నదిలో నుంచి ఇసుక తరలిస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు. నాలుగు ట్రాక్టర్లు మైదుకూరుకు చెందినవి, ఒకటి వి.రాజుపాలేనికి చెందినదిగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

టిప్పర్ల జప్తు : జమ్మలమడుగు: జమ్మలమడుగులోని వివిధ ప్రాంతాల్లో అయిదు ఇసుక టిప్పర్లను ఆదివారం జప్తు చేసినట్లు పట్టణ సీఐ లింగప్ప తెలిపారు. కొండాపురం వైపు నుంచి వస్తున్న టిప్పర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. జమ్మలమడుగు పెన్నా వంతెన వద్ద కొన్ని, కోవెలకుంట్ల బైపాస్ వద్ద మరికొన్ని ఇసుక టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు.

తెలుగు గంగ కాలువలో వ్యక్తి గల్లంతు

చాగలమర్రి న్యూస్‌టుడే : మండలంలోని చింతలచెరువు భైరవ గుండాల సమీపంలోని తెలుగు గంగ కాలువలో మైదుకూరుకు చెందిన వ్యక్తి నరేష్ (34) గల్లంతైన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుందని ఎస్సై రమేష్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు మైదుకూరుకు చెందిన నరేష్ చోలా ఫైనాన్స్‌లో కడప ఏరియా మేనేజరుగా విధులు నిర్వహిస్తున్నారు. నరేష్, అతని స్నేహితులు నారాయణరెడ్డి, రఫి, మస్తాన్‌లు కలసి ఆదివారం మండలంలోని భైరవగుండాల క్షేత్రానికి వెళ్లారు. క్షేత్రం దర్శనం అనంతరం సమీపంలోని తెలుగు గంగ కాలువ, పరిసరాల ఆహ్లాదకరమైన ప్రకృతి అందాలను చూస్తుండగా ప్రమాదవశాత్తు నరేష్ కాలువలో జారిపడ్డారు. అతన్ని కాపాడేందుకు మరో స్నేహితుడు నారాయణరెడ్డి కూడా కాలువలో దూకారు. అంతలోనే నరేష్ కాలువలో కొట్టుకు పోయారు. నారాయణరెడ్డిని స్థానికులు పంచసాయంతో బయటికి తీశారు. స్నేహితులంతా కాలువ వెంట వెతికినా కనపడకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. నరేష్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టామని ఎస్సై వెల్లడించారు

మండల అధికారుల బాధ్యతల స్వీకరణ

న్యూస్‌టుడే, క్లస్టర్ బృందం: మండల పరిషత్తు అభివృద్ధి అధికారులు ఆయా కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. మైలవరంలో రామచంద్రారెడ్డి, ప్రొద్దుటూరులో సూర్యనారాయణరెడ్డి, అట్లూరులో భాస్కర్‌బాబు, పెద్దముడియంలో శంషద్‌భాను, గోపవరంలో ఎం.రామనాథరెడ్డి, దువ్వూరులో రామకృష్ణ విధులు చేపట్టారు. మండల తహసీల్దారుగా అక్బర్‌బాషా బాధ్యతలు తీసుకున్నారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రొద్దుటూరు నూతన కార్యవర్గాన్ని స్థానిక ఐఎంఏ సభా భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ త్యాగరాజరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సాయిప్రసాద్, కోశాధికారిగా డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ.. వైద్యుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ప్రజలకు వైద్య సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.


దువ్వూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో ధనలక్ష్మీదేవిగా..


ప్రొద్దుటూరు రాజరాజేశ్వరి దేవాలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం


ప్రొద్దుటూరు రతనాల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం


బద్వేలులో పార్వతీదేవిగా....

అన్నపూర్ణా నమోస్తుతే

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లో దుర్గాదేవి అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ధాన్యరాసులు పుష్కలంగా పండించి రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా కటాక్షించు తల్లీ అంటూ భక్తులు వేడుకున్నారు. ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. **-న్యూస్‌టుడే, క్లస్టర్ బృందం**


కొండాపురంలో శ్రీకనకదుర్గాదేవిగా దర్శనం


మాధవరాయస్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా పార్వతీదేవి దర్శనం


జమ్మలమడుగులో బాలాత్రిపుర సుందరీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి


ప్రొద్దుటూరు హౌసింగ్‌బోర్డు కాలనీలో అన్నపూర్ణాదేవిగా పెద్దమ్మతల్లి

తెలుగుసాహిత్యంలో సుస్థిరస్థానం శివభారత కావ్యం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: దివంగత డాక్టర్ గడియార వెంకటశేష శాస్త్రి శివభారతం కావ్యాన్ని రచించి తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానం పొందారని డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి అన్నారు. ఆదివారం సాయంత్రం ప్రొద్దుటూరు పట్టణంలో శ్రీకృష్ణగీతాశ్రమంలోని ఆడిటోరియంలో మహాకవి డాక్టర్ గడియారం వెంకటశేషశాస్త్రి సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సభకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ గడియారం రచించిన శివభారత కావ్యం ఆయనకు ఎనలేని కీర్తిని తెచ్చిందన్నారు. గడియారం పేరుతో రచన సాహిత్య వేదికను ఆయన కుటుంబీకులు ఏర్పాటు చేసి అవార్డులివ్వడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన డాక్టర్ సింగరాజు రామకృష్ణ ప్రసాదరావు రచించిన 'శంభుభారతం' కావ్యానికి పురస్కారం ప్రదానం చేయడం హర్షనీయమన్నారు. ప్రధాన వక్త కొండపి మురళీ మాట్లాడుతూ శంభు భారతం కావ్యాన్ని అద్భుతంగా రచించారని కొనియాడారు. రచన సాహిత్య వేదిక ఉపాధ్యక్షుడు గడియారం వెంకట శేషశర్మ మాట్లాడుతూ సాహితీవేత్తలను ప్రోత్సహించేందుకు తాము గడియారం పురస్కారాలను ఏటా అందజేస్తున్నామన్నారు. అనంతరం సింగరాజుకు గడియారం వెంకటశేషశాస్త్రి అవార్డును ప్రదానం చేసి జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముడియం కిశోర్, సతీష్‌కుమార్, గడియారం కుటుంబీకులు, జింకా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ సింగరాజు రామకృష్ణ ప్రసాదరావు దంపతులను సన్మానిస్తున్న వక్తలు, గడియారం కుటుంబీకులు

విలీన గ్రామం... సమస్యల తాండవం

–న్యూస్‌టుడే, మైదుకూరు

పురపాలక సంఘ పరిధిలోని వీధులు అనేకం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. మైదుకూరు మండలంలో పంచాయతీ స్థాయిలో ఉన్న గ్రామీణ ప్రాంతాలు పట్టణ పరిధికి చేరాయి. తమ ప్రాంతం ఇక అభివృద్ధిపథంలో నడుస్తాయని ప్రజలు కన్న కలలు కల్లలుగా మారాయి. ప్రగతి బాట పట్టాల్సిన విలీన నివాస ప్రాంతాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడేనన్న చందంగా మారాయి. అటు పంచాయతీ అధికారులు పట్టించుకోక.. ఇటు పురపాలక బాధ్యులు గుర్తించక ప్రజల పరిస్థితి దయనీయంగా మారింది. గత వైకాపా పాలనలో అభివృద్ధి చేసి చూపిస్తామని శపథం చేసిన నాయకుల మాటలు నీటిమూటలయ్యాయి. గడ్డంవారిపల్లె, రాయప్పగారిపల్లె, గోపిరెడ్డిపల్లె, గోపిరెడ్డిపల్లె ఎస్సీకాలనీ, షాపూరు వాసులు సమస్యలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గడ్డంవారిపల్లెలో దూదేకులకాలనీలో వీధి ఒకటి అధ్వానంగా మారింది. ప్రధాన రహదారి కంటే చాలా దిగువగా ఉండటంతో వర్షాకాలంలో నీరు నిల్వ చేరి రాకపోకలకు కష్టంగా మారింది. స్థానికుడు ఒకరు స్పందించి గులకరాళ్లను తెప్పించి దారికి పోయించారు. రాయప్పగారిపల్లెలో ప్రధాన రహదారి కంటే వీధి దిగువలో ఉండటంతో వర్షాకాలంలో నీరు చేరుతోంది. సిమెంట్‌రోడ్డుతోపాటు మురుగుకాలువ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. శ్మశానం లేక పోవడంతో గ్రామానికి ఉత్తర దిశలో ఆలయానికి పోయే దారికి ఇరువైపుల ఖాళీ స్థలంలో మృతదేహాలను పూడ్చి వేస్తున్నారు. షాపూరులో ప్రధానవీధి అభివృద్ధికి నోచుకోలేదు. శ్మశానవాటిక ఆక్రమణకు గురైంది. గత ప్రభుత్వంలో బద్వేలురోడ్డు నుంచి గోపిరెడ్డిపల్లె మీదుగా ఎస్సీకాలనీ వరకు తారు రోడ్డు వేశారు. మార్గమధ్యలో వంకపై ఒకచోట, పంటకాలువపై మరోచోట కల్వర్టుల నిర్మాణం చేపట్టక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిసరాల పరిశుభ్రతపై ఇక వేరే చెప్పనక్కర లేదు. గోపిరెడ్డిపల్లె ఎస్సీకాలనీలో పైపులైను లేక పోవడంతో కాలనీవాసులు నీటితొట్టె వద్దకే చేరుకుని నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. గ్రామాలను పరిశీలించి ప్రాధాన్య క్రమంలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎం.శ్రీనివాసులరెడ్డి తెలిపారు.


పురపాలక సంఘ పరిధిలో ప్రజలకు ఇక్కట్లు


గడ్డంవారిపల్లెలో అధ్వానంగా రహదారి

సిమెంట్ రోడ్డు వేయండి

30ఏళ్లుగా నివాసం ఉంటున్నాం. దారి కూడా సరిగా లేక పోవడంతో నడవలేక పోతున్నాం. పక్కదారి గుండా పోవాల్సి వస్తోంది. వర్షమొస్తే మోకాటిలోతు నీళ్లు నిలబడుతూ ఉండటంతో ఒకరు దయతలచి గుండ్రాళ్లు పోయించారు. వీధికి పైపులైను వేశారు. మా వీధి ఆ దగ్గరే పైపులైను ఉన్నా తాగునీళ్లు రావడం లేదు. బోరు దగ్గరికే వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. వీధికి సిమెంట్ రోడ్డు వేయాలి. **-హుస్సేనమ్మ, గడ్డంవారిపల్లె**

అంధకారంలో ఉంటున్నాం



గోపిరెడ్డిపల్లె ఎస్సీకాలనీలో 25 కుటుంబాలు ఉన్నాయి. పది విద్యుత్తు స్తంభాలు ఉన్నా ఒక విద్యుద్దీపం వెలగలేదు. ఏడాది కిందట మరమ్మతు చేయిస్తామని కొన్ని విద్యుద్దీపాలు తీసుకు పోయారే కానీ తిరిగి అమర్చలేదు. రాత్రివేళ చీకట్లోనే ఉంటున్నారు. గ్రామ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. మురుగునీరు బయటకు వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలి. **-ఎద్దుల తిరుమలయ్య, గోపిరెడ్డిపల్లె ఎస్సీకాలనీ**

బాలుడిని కాపాడిన యువకుడు

మైదుకూరు: మైదుకూరు మండలం ప్రకాశ్‌నగర్ వద్ద ఆదివారం బ్రహ్మంసాగర్‌కాలువలోకి జారిపడిన పదేళ్ల బాలుడిని బ్రహ్మంగారిమఠం మండలం సోమిరెడ్డిపల్లెకు చెందిన ఇడమడక సాయి అనే యువకుడు కాపాడారు. భైరవకోనకు వెళ్లి ట్రాక్టరులో తిరిగి వస్తున్న భక్తులు ప్రకాశ్‌నగర్ వద్ద బ్రహ్మంసాగర్ కాలువ ర్యాంప్ నుంచి కాలువలోకి దిగారు. ఒక యువకుడితోపాటు పదేళ్ల బాలుడు కాలువలోకి జారిపడ్డారు. యువకుడిని వెంట వచ్చిన వారు కాపాడగా బాలుడిని బయటకు చేర్చలేక పోయారు. అదే సమయంలో పోరుమామిళ్లరోడ్డులో కారులో పోతున్న ఇడమడక సాయి వెంటనే కాలువలోకి దూకి బాలుడిని రక్షించారు. క్షేమంగా బాలుడు బయట పడటంతో భక్తులు ఊపిరిపీల్చుకున్నారు.

జిల్లా పేరు మార్చాలని వినతి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జిల్లా పేరును వైఎస్సార్ కడపగా గెజిట్‌లో సవరణ చేసేలా సహకరించాలని జిల్లా అభివృద్ధి వేదిక గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక ముద్దనూరురోడ్డులోని రిపబ్లిక్ క్లబ్‌లో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎమ్మెల్యేలందర్నీ కలిసి వినతిపత్రం అందజేసి జిల్లా పేరును గెజిట్‌లో మార్పు చేసేంత వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరుణ్‌కుమార్‌రెడ్డి, రమణ, వరదకుమార్‌రెడ్డి, నల్లం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలకు పేర్ల నమోదు

కొండాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతులకు రాయితీతో అందజేయనున్న శనగ విత్తనాలకు రైతు సేవా కేంద్రంలో సోమవారం నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో రామాంజులరెడ్డి తెలిపారు. ఆదివారం ఏవో మాట్లాడుతూ మండలానికి 3,042 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. శనగ క్వింటా పూర్తి ధర రూ.9,400 కాగా 25 శాతం రాయితీ రూ.2,350 పోనూ రైతువాటా రూ.7,050 చెల్లించాలన్నారు. కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, చరవాణి నెంబరుతో వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఆగిన వాహనం... ప్రజాపంపిణీకి ఆటంకం


బొల్లవరంలోని కంపచెట్లల్లో ఎండీయూ వాహనం


కొర్రపాడు రోడ్డులో మాజీ సీఎం జగన్ బొమ్మతో దూసుకెళ్తూ...

– న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

కూటమి సర్కారు ఏర్పడి మూడు నెలలు గడుస్తున్నా ప్రొద్దుటూరులో మాత్రం వైకాపా ప్రభుత్వం నడుస్తున్నట్లే కనిపిస్తోంది. ఇందుకు పైరెండు చిత్రాలే నిదర్శనం. .పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నడిచే ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన ఎండీయూ వాహనం (ఏపీ39టీఆర్5528) ఎఫ్‌పీ షాపు-2కు చెందినది. దీనిని వైకాపా నాయకుడు అనుచరుడు డీలరుగా వ్యవహరించేవారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఆ డీలరు రాజీనామా చేశారు. ఎండీయూ వాహనాన్ని అధికారులకు అప్పగించకుండా తన అధీనంలో పెట్టుకున్నారు. నియమితులైన కొత్త డీలరు గత మూడు నెలల నుంచి ఎండీయూ వాహనం ద్వారా లబ్ధిదారులకు సరకులు పంపిణీ చేయలేదు. దీనిపైన తాము వాహనానికి సుమారు రూ.80 వేలు చెల్లించామని, ఈ డబ్బులు ఇచ్చి వాహనాన్ని తీసుకెళ్లవచ్చని అడుగుతున్న ఏ అధికారి పట్టించుకోలేదని ఆ మాజీ డీలరు తాలుకు వైకాపా నాయకుడు చెప్పడం గమనార్హం. కొర్రపాడు రోడ్డులో మాజీ సీఎం జగన్‌రెడ్డి బొమ్మ కనిపించేలా నెంబరు లేకుండా ఓ ఎండీయూ వాహనం చక్కర్లు కొడుతోంది. దీనిని చూసిన వారంతా ఔరా! ఇదేమీ విచిత్రం అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తమ దృష్టికి రాలేదు. వెంటనే ఆరా తీసి ఎండీయూ వాహనాన్ని స్వాధీనానికి చర్యలు తీసుకుంటానని తహసీల్దారు గంగయ్య తెలిపారు.

సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఖేలో ఇండియా సబ్ జూనియర్స్ విభాగంలో ఖోఖో సౌత్ పోటీలకు ఆర్టీపీపీ డీఏవీ పాఠశాల విద్యార్థిని హరితారెడ్డి ఎంపికైనట్లు ఆదివారం వ్యాయామ ఉపాధ్యాయుడు నరేష్ తెలిపారు. ఈ నెల 5వ తేదీన ఒంగోలులో జరిగిన సెలక్షన్స్‌లో ఎంపిక చేశామన్నారు. కోయంబత్తూర్‌లో 16, 17వ తేదీ జరిగే పోటీల్లో పాల్గొనున్నట్లు వివరించారు.


హరితారెడ్డి

లీకేజీలు అరికట్టాలని వినతి

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: పోరుమామిళ్ల చెరువు లీకేజీలు అరికట్టాలని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్ డిమాండ్ చేశారు. సీపీఐ బృందం ఆధ్వర్యంలో ఆదివారం చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెరువు తూములు లీకేజీ అవుతున్నాయని చెప్పారు. శిథిలావస్థకు చేరిక తూములను మరమ్మతులు చేయించాలని తెలిపారు. బ్రహ్మంసాగర్ నుంచి పోరుమామిళ్ల చెరువుకు నీటిని విడుదల చేయాలన్నారు. నాయకులు రవికుమార్, కేశవ, చెన్నయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు పుర కమిషనర్‌గా మల్లికార్జున



ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘ కమిషనర్‌గా మల్లికార్జున రానున్నారు. అనంతపురం జిల్లా ధర్మవరం పుర కమిషనర్‌గా పని చేస్తూ ఇక్కడికి వస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికల బదిలీలో భాగంగా కమిషనర్‌గా మల్లికార్జున పనిచేశారు. ఇక్కడ పనిచేస్తుండిన జి.రఘునాథరెడ్డిని బాపట్లకు బదిలీ చేశారు.

బద్వేలు వాసులకు పురస్కారాలు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగరంలోని సిటీ కల్చరల్‌లో శనివారం రాత్రి మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బద్వేలుకు చెందిన యోవేవి పాలకమండలి సభ్యుడు కొండపల్లి చెన్నసుబ్బారావు, తెదేపా నాయకుడు కొంపల రాంబాబుకు నంది అవార్డులు ప్రదానం చేశారు. ఎంపీ చౌదరి చేతుల మీదుగా వీరు ఈ అవార్డులను పొందారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అడ్డుకోవాలి

మైదుకూరు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం మైదుకూరులో విలేకరులతో మాట్లాడుతూ విలువైన భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లించలేదని, ఉద్యోగాలు కల్పించలేదని ఇటువంటి తరుణంలో ప్రైవేటీకరణ చేస్తే రైతులకు తీరని అన్యాయం చేసినవారవుతారని హెచ్చరించారు. వామపక్షాలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు, రైతులు చేస్తున్న పోరాటాలకు మద్దతుగా నిలిచి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రైవేటీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

గ్రంథాలయానికి శుద్ధిజల యంత్రం వితరణ

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ గ్రంథాలయానికి దివంగత విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ కొండారెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి లక్ష్మీకాంతమ్మ నీటి శుద్ధి యంత్రాన్ని బహూకరించారు. ఆదివారం గ్రంథాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసులుకు అందజేయగా గడియారం సాహితీ పీఠం అధ్యక్షుడు డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు రిజర్వేషన్ల కేసు పరిష్కరించాలి

బద్వేలు గ్రామీణ: హోంగార్డు రిజర్వేషన్ల కేసును రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని వెంటనే పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, శివకుమార్ పేర్కొన్నారు. వారు బద్వేలులో విలేకర్లతో మాట్లాడారు. 6100 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలై రెండేళ్లైందన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు సత్కారం

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే : ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదురెడ్డిని రాష్ట్ర అధికార ప్రతినిధిగా వైకాపా అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా ఆదివారం ఆయనను ప్రొద్దుటూరులో ఆ పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఓబులరెడ్డి, రాజారాంరెడ్డి, తదితరులు సన్మానించారు.





కడప

• కడప • పులివెందుల • కమలాపురం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

పులివెందుల (వేంపల్లె), లింగాల, న్యూస్‌టుడే: పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లెలో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఒక్కచోటికి చేరి యోగక్షేమాలు విచారించారు. 32 ఏళ్ల తర్వాత సమ్మేళనానికి హాజరై అప్పటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. అనంతరం పూర్వక్రమాలల్లో అన్నదానం నిర్వహించారు.

శిల్పారామంలో దసరా సంబరాలు


నృత్యాలు చేస్తున్న కళా బృందం

మారుతీనగర్, న్యూస్‌టుడే: శిల్పారామంలోని కళావేదికలో ఆదివారం సంబరాలు అంబరాన్నంటాయి. మిస్సో మూవీ ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జానపద, శాస్త్రీయ, సినిమా పాటలకు నృత్యాలు చేశారు. చిన్నారులు, నగర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలు వీక్షించారు. శిల్పారామం పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

స్పందనకు వందనం

పట్టణంలోని ప్రదీప్ థియేటర్ ఎదురుగా రోడ్డు పక్కన చెత్తకుండి నిండి దుర్వాసన వస్తోందని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ షఫివుల్లా స్పందించారు. ఆదివారం పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తను శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, కమలాపురం

?: రవీంద్రనగర్‌లో నాలుగు రోజులైనా చెత్త వాహనం రావడం లేదు. చర్యలు తీసుకోవాలి. - ప్యారీబేగం, కడప.
✓: ప్రతి రోజూ చెత్త వాహనం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. - చంద్రశేఖర్, వైద్యాధికారి, నగరపాలక, కడప

?: కడప విశ్వేశ్వరయ్య విగ్రహం నుంచి ప్రకాష్‌నగర్‌కు వెళ్లే దారిలో రోడ్డు పక్కనే మట్టికుప్పలు వేశారు. రాత్రి వేళ కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. - విజయకుమార్, ప్రకాష్‌నగర్
✓: రోడ్డు పక్కనున్న మట్టి కుప్పలను తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. - చంద్రశేఖర్, వైద్యాధికారి, నగరపాలక, కడప. - న్యూస్‌టుడే, చిన్నచౌకు

?: కడపలో ప్రెస్‌క్లబ్ సమీపంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం పక్కనే రహదారిపై చెత్త పేరుకుపోయింది. - రత్నమ్మయ్య, కడప
✓: తక్షణమే చెత్తను ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటాం. - చంద్రశేఖర్, నగరపాలక వైద్యాధికారి, కడప

?: నగరపాలక ప్రధానపాఠశాల నుంచి మామిళ్లపల్లె బస్టాండుకు వెళ్లే మార్గంలో ఖాళీజాగాలో చెత్తనిల్వ ఉంది. - మల్లికార్జున, కడప
✓: తక్షణమే పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తను ఎత్తివేయిస్తాం. - చంద్రశేఖర్, ఎంహెచ్‌వో - న్యూస్‌టుడే, అరవిందనగర్ (కడప)

?: ఆపది వెళ్లెపల్లెలో రోడ్డుపై మురుగు పారుతుండటంతో దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - శ్రీనివాసరెడ్డి
✓: సిబ్బందిని పంపించి మురుగు తొలగిస్తాం. - చంద్రమౌళి, ఎంపీడీవో - న్యూస్‌టుడే, వీరపునాయునిపల్లె

?: భద్రంపల్లెలోని రామాలయం వద్ద పైపులైను పగిలిపోయి నీరు వృథాగా పోతోంది. - శివ, స్థానికుడు
?: భద్రంపల్లె ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. - కృష్ణ, స్థానికుడు
✓: పైపులైను, వీధి దీపాలు మరమ్మతులు చేయిస్తాం. - సాయిప్రతాప్‌రెడ్డి, పంచాయతీ అధికారి - న్యూస్‌టుడే, తొండూరు

?: మాధవరం-1 పరిధి ఐలీనగర్‌లో పైపులైను లీకేజీ కావడంతో తాగునీరు వృథాగా పోతున్నాయి. - ఓబులేసు, మాధవరం-1
✓: పరిశీలించి నివారణ చర్యలు చేపడతాం. - లక్ష్మీనరసయ్య, గ్రామకార్యదర్శి - న్యూస్‌టుడే, సిద్దవటం

?: వి.కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని అమ్మయ్యగారిపల్లె కాలనీలో రోడ్డుపై మురుగునిల్వలు కుంటను తలపిస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. - గ్రామస్థులు
✓: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో - న్యూస్‌టుడే, వేముల

ప్రకృతిలో విహరిస్తూ... అందాలను ఆస్వాదిస్తూ!


-న్యూస్‌టుడే, కడప ఏడురోడ్లు

ప్రజలకు ఆటవీప్రాంతం, వన్యప్రాణులపైన విజ్ఞానం, ఆహ్లాదం కల్పించడం..., ఆరోగ్యకరమైన వాతావరణం అందించడం.. ప్రకృతి ఒడిలో సేద తీరేలా చేయడానికి ప్రభుత్వం నగరవనాలు ఏర్పాటు చేసింది. ప్రస్తుత వీటి అభివృద్ధిపై దృష్టి సారించింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూపురేఖలు మార్చనుంది. ఇందులో భాగంగా కడప నగరవనానికి మొదటి విడతగా రూ.1.40 కోట్లను కేంద్రం విడుదల చేసింది. ఆటవీశాఖ వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు ఈ పనులను పూర్తిచేయనుంది. తర్వాత రెండో విడత పనుల సంబంధించి రూ. 60 లక్షలను ఇవ్వనుంది.

జిల్లాలో పరిస్థితి ఇలా..!

వైఎస్ఆర్ జిల్లాలో రెండు నగరవనాలు పూర్తియి అందుబాటులో ఉండగా, మరో రెండు నిర్మాణ దశలో ఉన్నాయి. కడప కేంద్రంగా 315 హెక్టార్లలో రూ.3 కోట్లతో నిర్మించిన నగరవనాన్ని 2019లో ప్రారంభించారు. పులివెందులలో రూ.3 కోట్లతో ఏర్పాటు చేయగా, 2022లో అందుబాటులోకి వచ్చింది. జమ్మలమడుగు మండలం పొన్నతోట, బద్వేలులో నగరవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి.

కడప నగర వనం అభివృద్ధికి రూ.2 కోట్లు


నగర వనం ప్రవేశ ద్వారం

చేపట్టే పనులు ఇవే...

ప్రస్తుతం విడుదల చేసిన నిధులతో కడపలోని వాకిస్ట్రెల్లో చెట్లను నాటడం, రోజ్ గార్డెన్, బటర్‌ఫ్లై గార్డెన్, లోటస్, ప్యాండ్, బొటానికల్ గార్డెన్స్, నర్సరీలు, ఆగ్నిప్రమాదాలను నివారించేలా ఫైర్‌లైన్లు, ఫైర్ వాచర్లను ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు ప్రజల ఆవాసాల్లో జంతువుల రాకుండా ఎన్‌క్లోజర్లను నిర్మిస్తారు. కొత్తగా పార్కులు, రోడ్ల నిర్మాణాలు, పార్కింగ్ ఏరియా అభివృద్ధి, వెదురు కర్రలతో పెన్సింగ్, కొండప్రై నడకదారి, పై నుంచి నగరాన్ని వీక్షించడానికి ప్రత్యేక వసతులు కల్పించనున్నారు. జాగింగ్ ట్రాక్, ప్రకృతిలో తిరగడానికి నేచర్ ట్రైల్, ట్రెక్కింగ్, వాచ్‌టవర్, పగోడాలు, చెట్ల మీద ఇళ్లు, వేలాడే బ్రిడ్జిలు, కిడ్ జంతువుల బొమ్మలు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు.

ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటుకు చర్యలు

ప్రతి నియోజకవర్గానికి ఒక నగరవనం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా వైయస్ఆర్ జిల్లాలో రెండు అందుబాటులో ఉండగా.. మరో 2 త్వరలో ప్రారంభం కానున్నాయి. కడప నగరవనం అభివృద్ధికి కేంద్రప్రభుత్వం రూ.2 కోట్లు ఇవ్వనుంది. మొదట విడతగా రూ.1.40 కోట్లు మంజూరయ్యాయి. వీటితో ప్రజలకు ఆకట్టుకునేలా అభివృద్ధి పనులను చేపడుతున్నాం. **- పి.వి.సందీప్‌రెడ్డి, డీఎఫ్ఓ**

సారూ... ఉద్యోగం ఇప్పించరూ!


ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు సమస్యను విన్నవిస్తున్న సుజనకుమారి

కమలాపురం, న్యూస్‌టుడే : 'హెల్పర్ ఉద్యోగాన్ని తిరిగి ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ కమలాపురం పట్టణానికి చెందిన అప్పాయపల్లె ఎస్సీ కాలనీకి చెందిన దివ్యాంగురాలు సుజనకుమారి ఆదివారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి పవన కల్యాణ్‌ను కలిసి వేడుకున్నారు. కమలాపురం పట్టణంలోని అగ్రికల్చర్ ల్యాబ్‌లో పదేళ్లుగా తాత్కాలిక పద్ధతిన హెల్పర్‌గా విధులు నిర్వహించానన్నారు. మూడు నెలల కిందట విధుల నుంచి తొలగించారన్నారు. ఎలాగైనా తనను తిరిగి నియమించాలని కోరారు. ఈ విషయంపై ఉపముఖ్యమంత్రి స్పందించారు, అధికారులతో మాట్లాడి ఎందుకు తొలగించారో కారణం తెలుసుకుని తిరిగి ఉద్యోగం ఇప్పించే ఏర్పాటు చేస్తానని భరోసా ఇచ్చారని సుజనకుమారి న్యూస్‌టుడేతో తెలిపారు.

రహదారిపై మురుగు పరుగు



కడప శివారులోని శ్రీనగర్‌కు వెళ్లేదారిలో భూగర్భడ్రైనేజీ దెబ్బతింది. సుమారు ఏడాది నుంచి మురుగు కొద్దికొద్దిగా లీకవుతోంది. ఇటీవల మొత్తం బయటకొచ్చి రోడ్డుపై పారుతోంది. అటు వైపు వాహనదారులు వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంది. మురుగునీరు నిల్వ ఉండడంతో అక్కడ గుంత ఏర్పడింది. నగరపాలక అధికారులు స్పందించి లీకేజీని కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కడప(చిన్నచౌకు)

గడువులోగా దరఖాస్తు చేసుకోండి

సిద్దవటం, న్యూస్‌టుడే : నూతన మద్యం దుకాణాల ఏర్పాటుకు ఈ నెల తొమ్మిదో తేదీలోగా ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని సిద్దవటం ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపారు. సిద్దవటంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం ఎక్సైజ్, ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో ఉన్న సిద్దవటం మండలంలో అయిదు, ఒంటిమిట్ట మండలంలో రెండు, అట్లూరు పరిధిలో ఒకటి చొప్పున మొత్తం ఎనిమిది మద్యం దుకాణాలు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఈ నెల 11న కడపలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో లాటరీ తీస్తారని చెప్పారు.

విపణిలోకి బజాజ్ ఫ్రీడం ద్విచక్ర వాహనం

వేంపల్లె, న్యూస్‌టుడే : తక్కువ ఖర్చుతో పాటు గ్యాస్, పెట్రోలుతో నడిచే ద్విచక్రవాహనాన్ని అందుబాటులోకి తీసుకురావడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. పులివెందుల రోడ్డులోని ఆయాన్ బజాజ్ షోరూంలో ఆదివారం గ్యాస్, పెట్రోలుతో నడిచే సీఎన్జీ బజాజ్ ఫ్రీడం ద్విచక్రవాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం నిర్వాహకుడు డా.ఇబ్రహీంను అభినందించారు. కార్యక్రమంలో అబ్దుల్‌రహిమాన్, అబ్దుల్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు బాబావళీద్దీన్, కమతంరాజు, కరీముల్లా, వేమనాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న తులసిరెడ్డి, నాయకులు

సమాజాభివృద్ధిలో గురువుల పాత్ర కీలకం

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే : సమాజాభివృద్ధిలో గురువుల పాత్రే కీలకమని పులివెందుల స్నేహిత అమృతహస్తం సేవా సమితి కన్వీనర్ రాజు పేర్కొన్నారు. పులివెందులలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇటీవల జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన రామ్మోహన్‌రెడ్డి, ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణిగా అవార్డు పొందిన జేఎన్‌టీయూ అధ్యాపకురాలు డా.మహేశ్వరమ్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖులు కిరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీదేవి, విజయానందన్‌రెడ్డి , హరికుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న రాజు, తదితరులు

సీఎన్‌జీ ద్విచక్ర వాహనం విడుదల


ద్విచక్ర వాహనాలను ప్రారంభిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు

అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే: పర్యావరణానికి పరిరక్షణగా ఉండేలా బజాజ్ ఆటో సరికొత్త సీఎన్‌జీ ద్విచక్రవాహనాన్ని తీసుకువచ్చిందని మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం కడపలోని బజాజ్ మోటారు వాహన షోరూంలో జరిగిన ఓ కార్యక్రమంలో ద్విచక్రవాహనాలను వారు విడుదల చేశారు. రెండు కిలోల సీఎన్‌జీతో 200 కిలోమీటర్ల పరిధిలో ప్రయాణించవచ్చన్నారు. అదనంగా రెండు లీటర్ల పెట్రోల్ ట్యాంకర్ కూడా ఉంటుందన్నారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

బస్టాండులో తాత్కాలిక మరమ్మతులు

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో నీరు నిల్వ ఉండకుండా ఇంజినీరింగ్ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయిస్తున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా బస్టాండు ప్రాంగణం చెరువును తలపిస్తుంది. దీంతో ఇంజినీరింగ్ అధికారులు తాత్కాలికంగా బస్టాండు ప్రాంగణంలో గుంత తీశారు. వాన నీరు గుంతలో పడితే మోటారు ద్వారా నీటిని బయటికి పంపించే విధానాన్ని ఏర్పాటు చేశారు.

ఉప్పరపల్లెలో చోరీ

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని ఉప్పరపల్లెలో చోరీ జరిగింది. గ్రామంలోని నూకల మురళీధర్ ఆర్టీసీ కండక్టరుగా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులు శనివారం బద్వేలులోని తమ బంధువుల వద్దకు వెళ్లారు. ఆదివారం ఉదయం తిరిగి రాగా అప్పటికే ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అనుమానంతో ఇంటి యజమాని బీరువాను పరిశీలించగా అందులోని రూ.40 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజునాయక్, క్లూస్ టీమ్ అధికారులు వచ్చి పరిశీలించారు.

వేడినీళ్లు పడి బాలుడికి గాయాలు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప చిన్నచౌకు ఠాణా పరిధిలోని బాలుడిపై ప్రమాదవశాత్తూ వేడినీళ్లు పడడంతో తీవ్రగాయాలయ్యాయి. కడప ఎన్జీవో కాలనీకి చెందిన యశ్వంత్(10) అనే బాలుడు ఆదివారం ఇంట్లో ఆడుకుంటుండగా వేడినీళ్లు మీద పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే బాలుడి తల్లిదండ్రులు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. పెద్దగాయాలు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని వైద్యులు తెలిపారు.

జూదరుల అరెస్టు

కమలాపురం, న్యూస్‌టుడే : మండలంలోని గంగవరం సచివాలయం పక్కన జూదమాడుతున్న 9 మందిని అరెస్టు చేసి రూ.33,860 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట


మాట్లాడుతున్న రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి పసుపులేటి శంకర్

సిద్దవటం, న్యూస్‌టుడే : సమాజంలో సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగు కాకుండా, అందరూ అనుసరించాలని రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ కోర్టు మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ తెలిపారు. సిద్దవటం మండలం మాచుపల్లెలోని జగజ్జనని రేణుకా ఎల్లమాంబ కోవెల వద్ద ఆదివారం నిర్వహించిన పూజా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జాతీయ హిందూ ధర్మం ప్రార్థనా దేవాలయ సంస్థ ఛైర్మన్ కళనాథ్‌రెడ్డి, పెంచలయ్య, అనితారెడ్డి, సుగుణమ్మ, ఉమామహేశ్వర్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలలితా శివజ్యోతి సర్వకామదా!

దసరా నవరాత్రుల మహోత్సవాలు నాలుగో రోజు ఆదివారం వైభవంగా సాగాయి. పలు ఆలయాల్లో అమ్మవారిని లలితా త్రిపుర సుందరి, అన్నపూర్ణాదేవి, గజలక్ష్మి తదితర రూపాల్లో అలంకించారు. ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేసి ఏకాంత పూజలు చేశారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. **- న్యూస్‌టుడే, బృందం**


కడప విజయదుర్గాదేవి ఆలయంలో....


దేవుని కడపలో హనుమంత వాహనంపై శ్రీవారు


ఒంటిమిట్ట కన్యకాపరమేశ్వరి ఆలయంలో గజలక్ష్మి అలంకారంలో


వేములలో అన్నపూర్ణాదేవి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి


కడప అమ్మవారిశాలలో గజలక్ష్మి అలంకారంలో..


గడ్డిబజార్ సోమసుందరేశ్వర స్వామి ఆలయంలో


సత్యనారాయణస్వామి ఆలయంలో రాధాకృష్ణ అలంకరణ


మున్సిపల్ మైదానంలోని రాజరాజేశ్వరి ఆలయంలో..


వల్లూరులో పార్వతీదేవి అలంకరణలో..


సిద్దవటం మండలం ఉప్పరపల్లెలో లలితా త్రిపుర సుందరి అలంకరణలో దుర్గాదేవి


సీకేదిన్నెలో లలితాదేవి అలంకరణలో గంగమ్మ


కమలాపురం: గాయత్రీదేవిగా వాసవీమాత


పులివెందులలో గాయత్రిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి


కడప నడివీధి గంగమ్మ ఆలయంలో..

బస్టాండు నిర్మాణం పూర్తి చేయాలి

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లెలో నిర్మిస్తున్న ఆర్టీసీ బస్టాండు పనులను సత్వరం పూర్తి చేసి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ కోరారు. బస్‌స్టేషన్ ప్రాంగణంలో మరుగుదొడ్లు తొలగించిన ప్రాంతాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. ప్రాంగణంలోని మరుగుదొడ్లను కూల్చివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకుని బస్‌స్టేషన్‌లో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



కమలాపురం, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో పట్టణానికి చెందిన మహమ్మద్ సూఫియాన్ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించాడు. సూఫియాన్ కడప నగరంలోని వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగిన పోటీల్లో అండర్ - 14 బాలుర విభాగం జావెలిన్ త్రో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన


శిబిరానికి హాజరైన నగరవాసులు

కడప ఏడు రోడ్లు, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ విశ్రాంత అటవీ ఉద్యోగులు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన శాంతిరామ్ ఐ హాస్పిటల్ వారు ఆదివారం కడప డీఎఫ్‌వో కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విశ్రాంత అటవీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, అటవీ ఉద్యోగులతో పాటు ప్రజలు ఉచితంగా కంటి పరీక్షలను చేయించుకున్నారు. అవసరమైన వారికి శుక్లం ఆపరేషన్లను ఉచితంగా చేయనున్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగార్జున, ఆంధ్రప్రదేశ్ విశ్రాంత అటవీ ఉద్యోగులు సంక్షేమ సంఘం రాష్ట్ర కోశాధికారి శ్రీరాములు, జిల్లా అధ్యక్షుడు బి.వి.రాజు, ఉపాధ్యక్షుడు యేసురత్నం, జిల్లా కోశాధికారి భాస్కర్‌రెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి బాబు, ఈసీ సభ్యులు రమణ, హసనయ్య తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా బాలికలు... క్రీడల్లో దిట్టలు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలతో ప్రిన్సిపల్ సరస్వతీ, పీఈటీ సంతోషికుమారి

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు పెండ్లిమర్రి కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులు. 23 మంది బాలికలు ఎస్‌జీఎఫ్ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. జిల్లా స్థాయిలో గండి, పులివెందుల, మైదుకూరు, పుల్లంపేట, రాయచోటి, కడపలో జరిగిన ఎస్‌జీఎఫ్ హాకీ, ఫుట్‌బాల్, రెజ్లింగ్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, క్రికెట్, అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్, బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణించారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో సత్తా చాటేందుకు బాలికలు సిద్ధమవుతున్నారు.

తండ్రి ప్రోత్సాహంతో



మా తండ్రి గంగరాజు ప్రోత్సాహంతో ఫుట్‌బాల్ పోటీల్లో రాణిస్తున్నాను. ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచాను. క్రీడల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయిలో సత్తా చాటేందుకు కృషి చేస్తున్నాను.

- మనీష, ఇంటర్ ప్రథమ సంవత్సరం

జాతీయస్థాయిలో రాణించాలన్నదే లక్ష్యం



పీఈటీ, ఉపాధ్యాయుల సూచనలతో చదువుతో పాటు సాఫ్ట్‌బాల్ పోటీల్లో జాతీయస్థాయిలో రాణించాలన్నదే లక్ష్యం. అండర్-19 విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో రాణించేందుకు సాధన చేస్తున్నాను.

- నవీన, ఇంటర్ ద్వితీయ సంవత్సరం

అథ్లెటిక్స్‌లో సత్తాచాటుతా



పీఈటీ సంతోషి కుమారి, ప్రిన్సిపల్ సరస్వతీ, తల్లిదండ్రుల సలహాలు పాటిస్తూ అథ్లెటిక్స్ పోటీల్లో రాణించేందుకు సాధన చేస్తున్నా. ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. పోటీల్లో ప్రతిభ కనబర్చేందుకు సాధన చేస్తున్నాను.

-శ్రీలక్ష్మి, ఇంటర్ ప్రథమ సంవత్సరం